
సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం । 6 । ఆగస్టు । 2025





## రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

రాఖీ పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ఈ నెల 7 నుంచి అదనపు బస్సు సర్వీసులను నడపనున్నారు.

-10లో ▸



## ప్రజా సమస్యలపై పోరాటాలు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అలుపెరగని పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ నేత చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.

-10లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /22.5

## వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

### న్యూస్‌రీల్

## కర్వెన ప్రాజెక్టు పరిశీలన



భూత్పూర్: మండలంలోని కర్వెన వద్ద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును మంగళవారం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ నర్సింహారెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు పనుల గురించి డీఈ విజయేందర్‌తో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, చేయాల్సిన పనుల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## పీయూలో అధికారుల నియామకం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు అధికారులను నియమిస్తూ వీసీ శ్రీనివాస్ ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పొలిటికల్ సైన్స్ సీనియర్ అధ్యాపకులు భూమయ్యను నియమించారు. ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కంప్యూటర్ అప్లికేషన్స్ గౌస్ మోయినోద్దీన్‌ను నియమించారు. పీఆర్వోగా సోషల్ వర్క్ విభాగానికి చెందిన గాలెన్నను నియమించారు. అకాడమిక్ ఆడిట్ సెల్ కోఆర్డినేటర్‌గా రవికుమార్‌ను నియమించారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించినందుకు అధికారులు వీసీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాళ్లు, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కన్వీనర్ కోటాలో సీట్ల కోసం ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని, 11వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు పదో తరగతి పూర్తి చేసి, పాలిసెట్ రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అఖండ దీపారాధన ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న శ్రీ వీరభద్రస్వామి అఖండ దీపారాధన పూజా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ప్రతి ఏడాది స్వామివారి క్షేత్ర పాలకుడైన వీరభద్రస్వామి అఖండ దీపారాధన వ్రత మహోత్సవాన్ని 41 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. అనంతరం మరుసటి రోజు స్వామివారి అగ్నిగుండం కార్యక్రమాన్ని చేపడతారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్వామివారిని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, తదితరులు పాల్గొన్నారు.

# లీలలు చూడతరమా!

## తవ్వినకొద్దీ వెలుగులోకి ఘరానా దొంగ మోసాలు

- పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ
- యథేచ్ఛగా డూప్లికేట్ మరణ ధ్రువీకరణ పత్రాల తయారు
- అమాయకుల నుంచి తెల్ల కాగితాలపై సంతకం..
- ఆ తర్వాత ఇన్సూరెన్స్, రైతు బీమాకు దరఖాస్తు
- అసలు వ్యక్తులకు తెలియకుండానే రుణాల స్వాహా



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లాలోని గండేడ్ మండలంలో వెలుగు చూసిన ఘరానా దొంగ బాగోతంలో తవ్వినకొద్దీ డొంక కదులుతోంది. పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేయడంతో పాటు డూప్లికేట్ మరణ ధ్రువీకరణ పత్రాలను తయారుచేసి ఇన్సూరెన్స్, రైతు బీమా సొమ్మును పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. అమాయక రైతుల నుంచి తెల్లకాగితాలపై సంతకాలు సేకరించి.. వారికి తెలియకుండానే రూ.లక్షల కొద్దీ రుణాలు స్వాహా చేసినట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బ్యాంకర్లు రికవరీకి వచ్చే వరకూ సదరు వ్యక్తులకు తాము మోసపోయినట్లు తెలియకపోవడం గమనార్హం. మరోవైపు ఇన్ని రకాల మోసాలు జరిగినా, పలు అంశాలు వెలుగులోకి వచ్చినా.. పంచాయతీ కార్యదర్శితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు ఎవరికీ ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### చనిపోయిన తల్లి స్థానంలో వేరొకరి ఫొటోతో..

గండేడ్ మండలం రెడ్డిపల్లికి చెందిన ఘరానా మోసగాడి తల్లి మృతి చెంది దాదాపు ఏడాదవుతోంది. ఈ క్రమంలో రైతు బీమా పొందేందుకు పక్కా ప్లాన్ వేశాడు. తన తల్లి స్థానంలో అదే గ్రామానికి చెందిన దాసరి కమలమ్మ ఫొటోతో పత్రాలు సృష్టించి (పేరు మాత్రం అతడి తల్లిదే).. తన పేరిట ఉన్న దాంట్లో రెండు గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ తర్వాత ఆమె చనిపోయినట్లు తప్పుడు తేదీతో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అధికారులు ఈ బీమాను చెల్లించకుండా రద్దు చేశారు. ప్రస్తుతం కమలమ్మ బతికే ఉన్నా.. రికార్డులో మాత్రం చనిపోయినట్లు ఉంది. దీంతో పింఛన్ కూడా రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.

### ఆధార్‌కార్డు మార్చి.. దొరికిపోయి

రెడ్డిపల్లికి చెందిన నాగయ్య చనిపోయాడు. ఈయన ఆధార్‌కార్డుకు సంబంధించి నాగయ్య స్థానంలో అదే గ్రామానికి చెందిన మాదయ్య ఫొటోను మార్పించాడు. మాదయ్య తన ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో బుక్ చేసేందుకు వెళ్లగా.. ఆధార్‌కార్డులో నాగయ్య పేరు, ఫొటో మాదయ్యది వచ్చింది. దీంతో సదరు మోసగాడిని నిలదీస్తే మళ్లీ ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు చేయించి ఇచ్చినట్లు మాదయ్య తెలిపారు.

### ఫొటో మార్చి.. నామినీని ఏ మార్చి..

రెడ్డిపల్లికి చెందిన గొల్ల కృష్ణయ్యకు సంబంధించి సర్వేనంబర్ 39/అ/1 ఉండగా.. దీనికి బై నంబర్ 39/రు ఇచ్చి భూమి పత్రాల్లో 1.28 ఎకరాలను సదరు మోసగాడు 4.28 ఎకరాలుగా మార్చాడు. మోసగాడి బావమరిది హన్వాడ మండలం టంకర గ్రామం కాగా.. అతడి పేరు, గొల్ల కృష్ణయ్య ఫొటోతో ఆధార్‌కార్డు సృష్టించి.. తన బావమరిది పేరు మీద మహబూబ్‌నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఆ తర్వాత తన బావమరిది చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నాడు. ఈ మేరకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ వచ్చింది. నామినీగా తన బావమరిది భార్య స్థానంలో గొల్ల కృష్ణయ్య భార్య పేరు పెట్టి బీమా తీసుకున్నాడు. దీనికి ముందు గొల్ల కృష్ణయ్య భార్య ఆధార్‌కార్డు మార్పించడమే కాకుండా.. ఆమె పేరు మీద అకౌంట్ కూడా తీశాడు. ఏటీఎంను ఆమెకు ఇవ్వకుండా తన వద్దే పెట్టుకుని.. మొత్తం డ్రా చేసుకున్నాడు. అయితే ఆ ఫోన్ నంబర్ గొల్ల కృష్ణయ్యది కాగా.. అమౌంట్ పడినట్లు మెసేజ్ రావడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా గండేడ్ బ్యాంక్‌లో తన భార్య పేరిట సదరు మోసగాడు రూ.1.20 లక్షల రుణం తీసుకున్నాడని.. రెండుసార్లు నోటీస్ రావడంతో ఈ విషయం బయటపడిందని కృష్ణయ్య తెలిపారు. ఇదే కాకుండా మరో రూ.20 లక్షలు తన భార్య పేరు మీద చూపిస్తోందని.. చోళ ఫైనాన్స్‌లో హౌసింగ్ లోన్ తీసుకునేందుకు వెళ్లినప్పుడు బయటపడిందని.. తమకు న్యాయం చేయాలని కృష్ణయ్య వేడుకుంటున్నాడు.

### రైతు బీమాపై కన్నేసి.. బతికుండగానే చంపేసి..

గండేడ్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాళ్ల ఆంజనేయులు ప్రస్తుతం బతికే ఉన్నాడు. అతడి తండ్రి గాళ్ల గోవిందు గతంలోనే మృతి చెందాడు. ఈ క్రమంలో సదరు మోసగాడు ఆంజనేయులు పేరిట భూమి ఉన్న విషయాన్ని గ్రహించి.. అతడి పేరుతో రైతు బీమా పొందేందుకు ప్లాన్ వేశాడు. పంచాయతీ కార్యదర్శికి సంబంధం లేకుండా సంతకం ఫోర్జరీ చేసి.. ఆంజనేయులు మృతి చెందినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేశాడు. ఆ తర్వాత బీమా డబ్బుల కోసం బ్యాంకులో డాక్యుమెంట్లు అందజేశాడు. బ్యాంక్ అధికారులకు అనుమానం వచ్చి విచారణ చేయగా.. తప్పుడు ఫోర్జరీ మరణ ధ్రువీకరణ పత్రంగా తేలింది. దీంతో బీమా చెల్లింపు నిలిచిపోయింది.

### తెల్లకాగితాలపై సంతకం పెట్టా.. నన్నే మోసం చేశాడు

మూడేళ్ల క్రితం నన్ను హైదరాబాద్ నుంచి పిలిపించాడు. నంచర్ల బ్యాంకులో పని ఉందని రమ్మన్నాడు. తెల్లకాగితాల మీద సంతకం పెట్టమన్నాడు. సంతకం పెట్టాక క్యాషియర్ డబ్బిస్తే కౌంటర్ వద్దే లాగేసుకున్నాడు. లెక్క కూడా పెట్టలేదు. అలా ఎందుకు తీసుకుంటున్నావని అడిగితే.. అవి నీవి కావని సమాధానం ఇచ్చాడు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌లో మూడు, నాలుగు బ్యాంకులకు తీసుకెళ్లి సంతకాలు పెట్టించుకున్నాడు. ఎంత రుణం తీసుకున్నాడో.. ఏం చేశాడో తెలియదు. అయితే నా భార్య పేరిట నంచర్ల ఎస్‌బీఐలో లోన్ తీసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళా గ్రూప్‌నకు లోన్ ఇచ్చేటప్పుడు ఆమె పేరు మీద ఇది వరకే రుణం తీసుకున్ననట్లు ఉంది.. మళ్లీ రునం ఇవ్వమని బ్యాంక్ అధికారులు చెప్పడంతో తెలిసింది.

– మాదయ్య, రెడ్డిపల్లి, గండేడ్

## భూ నిర్వాసితులకు త్వరితగతిన పునరావాసం



కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేందిర

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు త్వరితగతిన పునరావాసం కల్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మిషన్ భగీరథ తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంటతండా, రేగడిపల్లితండా, చిన్నగుట్టతండా, శామగడ్డతండా, ఒంటిగుడిసెతండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు, అవార్డు అందుకున్న వారందరికీ 300 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్రం, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, గ్రామపంచాయతీ భవనం, పార్కులు, రోడ్లు డ్రెయినేజీలు, విద్యుత్ సరఫరా, ఓవర్‌హెడ్ ట్యాంకులు, మిషన్ భగీరథ పథకం పైపులైన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

### స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ రోజు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో వేదిక, వీఐపీలు, ఆయా శాఖల అధికారులకు కుర్చీలు ఉండేలా చూడాలన్నారు. అందరికీ తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్య అతిథి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలను సీపీఓకు పంపించాలన్నారు. నగరంలోని ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేయాలన్నారు. ఆయా శాఖలు సాధించిన ప్రగతిని తెలుపుతూ శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అడిషనల్ కలెక్టర్లు ఎ.నరసింహారెడ్డి, శివేంద్రప్రతాప్, సీపీఓ రవీందర్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, మహిళా–శిశు సంక్షేమ అధికారిజరీనాబేగం, డీఎస్‌ఓ గంప శ్రీనివాస్, ఆర్డీఓ నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శిల్పారామంలో మహిళలకు 10 స్టాళ్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో ఉన్న 42 స్టాళ్ల (షాపులు)లో పది మహిళ (ఎస్‌హెచ్‌జీ)లకు కేటాయిస్తామని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో వీధి వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిల్పారామంలోని స్టాళ్లు, ఫంక్షన్ హాలు, ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అద్దెకు ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. త్వరలో టెండర్లు నిర్వహించనున్నామని ఔత్సాహికులు పాల్గొనవచ్చన్నారు. కాగా, ఏ షాపు ఎంత విస్తీర్ణం ఉందో కొలతలు చేసి ఎంత అద్దె ఉండాలో నిర్ణయించాలని ఆర్‌ఓ మహమ్మద్ ఖాజాను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి, ఆర్‌ఐలు టి.నర్సింహ, అహ్మద్‌షరీఫ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

# రైతుల మేలుకే కాళేశ్వరం ప్రాజెక్టు

- మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమ హయాంలో రైతులకు మేలు చేసేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్లు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో చూశారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ 2007 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ్మిడిహట్టి వద్ద దమ్మిడి పని కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోనే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు నిర్మించామన్నారు. దీనికి 19 సబ్‌స్టేషన్లు, 203 కి.మీ. సొరంగం, 1534 కి.మీ. గ్రావిటీ, 240 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టుతో 20,33,572 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంలో రెండు పిల్లర్లతోనే ఇబ్బంది ఉందని, కేవలం రెండు నెలల్లోనే వాటికి మరమ్మతు చేసి నీళ్లు ఇవ్వవచ్చన్నారు. ఈ ప్రాజెక్టు కొట్టుకుపోతే బాగుండు.. అని కాంగ్రెస్ నాయకులు ఎదురు చూసింద్రని విమర్శించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇవ్వకుండానే ఎలా బయటకు వచ్చిందన్నారు. ప్రస్తుతం పండిన పంటలకు కనీస ధర దక్కడం లేదని, రైతులకు అలుగుపిండి, యూరియా పిండి దొరకడం లేదని, కరెంట్ కూడా ఉండటం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు సకాలంలో అన్నీ అందేలా చేశామన్నారు. అలాగే మహబూబ్ నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు వాల్యానాయక్, రాజేశ్వర్‌గౌడ్, యాదయ్య, నర్సింహులు, ఆంజనేయులు, రహమాన్, శివరాజ్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, తదితరులు

# రాములు దారెటో..?

- బీఆర్‌ఎస్‌లో టికెట్ దక్కక కమలం గూటికెళ్లిన మాజీ ఎంపీ
- బీజేపీలోకి గువ్వల రాక నేపథ్యంలో మళ్లీ అలజడి
- కుమారుడి భవితవ్యంపై ఆందోళన
- గువ్వల బాటలో మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్‌ను వీడుతూ బీజేపీలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఉదంతం ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. రెండు దశాబ్దాలుగా పైగా గులాబీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన గువ్వల అనూహ్యంగా పార్టీ మారడం పట్ల బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఆయనతో పాటు మరికొందరు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సైతం పార్టీని వీడుతారన్న ప్రచారం నేపథ్యంలో వారంతా అయోమయంలో ఉన్నారు. అయితే పార్టీ మార్పుపై వదంతుల వ్యాప్తి ఉధృతంగా మారిన క్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ తాము పార్టీ వీడేది లేదని తెగేసి చెబుతున్నారు. గువ్వల బీజేపీలో చేరుతుండటంతో బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీలోని నేతలను సైతం కలవరపెడుతుండటం గమనార్హం.

### గువ్వల వెంట వెళ్లేందుకు కేడర్ విముఖత..

మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరుతున్నట్టు తన ముఖ్య అనుచరులు, కేడర్‌గా ముందుగానే చెప్పారు. వారి నుంచి సహకారం కావాలని, తనతో పాటుగా బీజేపీకి రావాలని ఆహ్వానిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ భవిష్యత్‌లో బీజేపీతో కలిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వారి కన్నా ముందే తాము బీజేపీలో చేరితే గౌరవం నిలబడుతుందని కేడర్‌తో చెబుతున్నారు. తద్వారా జాతీయ రాజకీయాల్లోనూ క్రియాశీలకంగా పనిచేయవచ్చని అంటున్నారు. అంబేడ్కర్ ఆశయాలు, జాతీయవాదాన్ని ఆచరించే పార్టీతో పని చేస్తానని చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆయనతో వెళ్లేందుకు బీఆర్‌ఎస్ కేడర్ విముఖంగా ఉందని తెలుస్తోంది. అచ్చంపేట నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, అనుచరులు గువ్వల పాటు బీజేపీకి వెళ్లేందుకు నిరాసక్తతను కనబరుస్తున్నారు. ఇప్పటికే గువ్వల పార్టీ మారుతున్న ప్రచారం మొదలైన క్రమంలోనే సోమవారం సీఎం రేవంత్ సమక్షంలో పదర మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, గువ్వల ముఖ్య అనుచరుడు రాంబాబునాయక్ కాంగ్రెస్‌లో చేరారు.



భరత్‌ప్రసాద్



గువ్వల బాలరాజు

### భరత్ భవితవ్యంపై బెంగ..

సుదీర్ఘకాలంగా రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి రాములు గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. తన కుమారుడు భరత్‌ప్రసాద్ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీలో చేరి.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. రానున్న కాలంలోనూ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఆశతో ఉన్నారు. అయితే గులాబీ పార్టీలో గువ్వలలో అంతర్గత పోరులో భాగంగా బీజేపీలో చేరితే.. ఇప్పుడు మళ్లీ గువ్వల రూపంలోనే పోటీ ఎదురవుతోందన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఆసక్తి నెలకొంది. అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పనిచేసిన రాములు కార్యక్షేత్రంపైనే ఆయన తనయుడు భరత్ ఆశలు పెట్టుకున్నారు. బీఆర్‌ఎస్‌లో ఉండగా జెడ్పీ చైర్మన్ పదవి, అచ్చంపేట ఎమ్మెల్యే సీటు, నాగర్‌కర్నూల్ ఎంపీ సీటు కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ప్రధానంగా గులాబీ పార్టీలో గువ్వల బాలరాజు ప్రభావంతో తమకు అవకాశాలు దక్కలేదని భరత్‌ప్రసాద్ భావించారు. ఈ కారణాలతోనే రాములు సైతం కుమారుడితో కలిసి పార్టీని వీడి అనూహ్యంగా బీజేపీలో చేరాల్సి వచ్చింది. ఇప్పుడు గువ్వల సైతం బీజేపీలోనే చేరుతుండటంతో భరత్‌ప్రసాద్ భవితవ్యంపై వారి అనుచరులు బెంగ పెట్టుకుంటున్నారు.

ప్రధానంగా అచ్చంపేట నియోజకవర్గంలో బీజేపీ ప్రభావం తక్కువగా ఉండటం, బీజేపీ కన్నా బీఆర్‌ఎస్ కేడర్ బలంగా ఉందన్న భావన నేపథ్యంలో ఎక్కువ మంది అనుచరులు బీజేపీలో చేరడానికి విముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.

### పార్టీ మారినా.. తప్పని పోరు..

బీఆర్‌ఎస్‌లో గువ్వల బాలరాజు, మాజీ ఎంపీ రాములు మధ్య సుదీర్ఘంగా కాలం పాటు సాగిన వర్గపోరు ఇప్పుడు పార్టీ మారినా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గులాబీ పార్టీలో గువ్వల ఆధిపత్యం నేపథ్యంలో రాములు కారు దిగి.. కమలం గూటికి చేరారు. రానున్న కాలంలో ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న అచ్చంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా లేదా నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా తమ కుమారుడిని దింపి అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న తలంపుతో ఉన్నారు. ఇప్పుడు మళ్లీ గువ్వల రంగప్రవేశంతో ఎటువైపు దారి తీస్తుందోనన్న ఆందోళన నెలకొంది.

# మెప్మా రుణ ప్రణాళిక ఖరారు

- 2025–26లో బ్యాంకు లింకేజీ కింద రూ.93.18 కోట్లు
- ఎస్‌హెచ్‌జీలకు ఎస్‌ఈపీ కింద మరో రూ.29 లక్షలు
- మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పట్టణాలలో 740 మహిళా గ్రూపులకు లబ్ధి
- గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో లక్ష్యాన్ని దాటిన వైనం




మహబూబ్‌నగర్‌లోని మహిళా గ్రూపులతో రుణాలపై చర్చిస్తున్న మెప్మా సీఓలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు మెప్మా పరిధిలో 2025–26 ఆర్థికసంవత్సరానికి రుణ ప్రణాళిక ఖరారైంది. మహబూబ్‌నగర్ నగరంతో పాటు జడ్చర్ల, భూత్పూర్ పట్టణాలకు చెందిన 740 స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ)లకు మొత్తం రూ.93,47,42,000 ఇవ్వనున్నారు. ఇందులో బ్యాంకు లింకేజీ కింద మహబూబ్‌నగర్‌లోని 466 మహిళా సంఘాలకు రూ.57,93,40,000 కేటాయించారు. జడ్చర్లలోని 167 సంఘాలకు రూ.22,61,24,000, భూత్పూర్‌లోని 77 సంఘాలకు రూ.12,63,78,000 ఇవ్వనున్నారు. అలాగే సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌ఈపీ) కింద 30 యూనిట్లకు గాను రూ.29 లక్షలు కేటాయించారు. వీటిలో మహబూబ్‌నగర్ నగర పరిధిలోని 19 మందికి రూ.లక్ష చొప్పున ఇవ్వనున్నారు.

■ గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో మూడు పట్టణాలకు కలిపి బ్యాంకు లింకేజీ కింద 632 ఎస్‌హెచ్‌జీలకు రూ.74,01,40,000 ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా.. 742 ఎస్‌హెచ్‌జీలకు రూ.86,86,18,000 ఇచ్చారు. ఇందులో మహబూబ్‌నగర్ నగర పరిధిలోని 428 ఎస్‌హెచ్‌జీలకు రూ.52,64,00,000 ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటే.. 543 గ్రూపులకు రూ.70,62,18,000 ఇచ్చారు. జడ్చర్లలో 114 గ్రూపులకు రూ.12,08,02,000 ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటే.. 121 గ్రూపులకు రూ.10,79,00,000 ఇచ్చారు. భూత్పూర్‌లోని 67 ఎస్‌హెచ్‌జీలకు రూ.9,06,38,000 ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటే.. 59 గ్రూపులకు రూ.5,16,00,000 ఇచ్చారు. ఇక ఎస్‌ఈపీ కింద మూడు పట్టణాలకు కలిపి 23 గ్రూపులకు రూ.23 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే 19 గ్రూపులకు రూ.29 లక్షలు ఇచ్చారు.

### లక్ష్యాన్ని చేరుకుంటాం..



గతేడాది లక్ష్యాన్ని దాటి మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పట్టణాలలోని మహిళా సంఘాలకు రుణాలిఇచ్చాం. ఈ ఏడాది సైతం గడువులోగా లక్ష్యాన్ని అధిగమించి రుణాలు పంపిణీ చేస్తాం. ఈపాటికే వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈ మూడు పట్టణాలలో లబ్ధిదారులను గుర్తించి రుణాలు ఇస్తున్నాం. వీటిని అందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలి.

– ఎం.లక్ష్మి, ఇన్‌చార్జ్ డీఎంసీ, మెప్మా, మహబూబ్‌నగర్

## క్లుప్తంగా

### ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం



జడ్చర్ల టౌన్: పొలంలో కరిగెట చేస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని చర్లపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. నసుర్లాబాద్‌కు చెందిన ఎరుకలి మల్లేష్ (40) ఆటో, ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగించేవాడు. మంగళవారం చర్లపల్లి శివారులో ఓ రైతు పొలంలో కరిగెట చేస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడగా అందులో ఇరుక్కొని మృతిచెందాడు. మల్లేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### మృతదేహం లభ్యం



గద్వాల క్రైం: జూరాల కుడి కాల్వలో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం జములమ్మ జలాశయంలో లభ్యమైందని పోలీసులు తెలిపారు. కడప జిల్లాకు చెందిన పెంచలయ్య (48) గద్వాలలోని బీరోలు–గద్వాల మార్గంలో తాత్కాలిక గుడిసె ఏర్పాటు చేసుకొని వన మూలికలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. సోమవారం రాత్రి కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లిన పెంచలయ్య కాలు జారిపడి గల్లంతయ్యాడు. అదే రాత్రి పోలీసులు, అగ్నిపమాక సిబ్బంది వెదికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం జములమ్మ రిజర్వాయర్‌లో మృతదేహం కనిపించడంతో అగ్నిపమాక సిబ్బంది రాకేష్, లక్ష్మణ్‌నాయుడు, రవిప్రకాష్, సందీప్ బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెంచలయ్య రెండునెలల కిందట కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం ఈ ప్రాంతానికి వచ్చారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

### చికిత్స పొందుతూ యువతి మృతి

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన సవిత (18) కామెర్ల వ్యాధితో బాధపడుతూ మంగళవారం నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయమై మృతురాలి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


పెద్దకొత్తపల్లి: గూడ్స్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చెన్నపురావుపల్లికి చెందిన కావలి రాముడు (58) గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా కొల్లాపూర్ నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న గూడ్స్ వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాముడుకు భార్య లలిత, ముగ్గురు కుమారులు ఉన్నారు.

### ప్రైవేట్ ఫైనాన్స్‌లో బంగారు నగ మాయం?

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్సులో కుదువపెట్టిన నగను మార్చిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. పట్టణానికి చెందిన ఓ మహిళ కొన్ని నెలల క్రితం 14 తులాల బంగారు వస్తువులు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంది. మంగళవారం వడ్డీతో సహా డబ్బులు చెల్లించి తన నగలు ఇవ్వాలని ఫైనాన్సు నిర్వాహకులను కోరింది. అయితే 10 తులాలకు సంబంధించిన నెక్లెస్ తనది కాదని వేరే వస్తువు ఇస్తున్నారని సదరు మహిళ ఫైనాన్సు కార్యాలయంలో ఆందోళన చేసింది. చివరకు నిర్వాహకులు నగ ఇప్పిస్తామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

# రాఖీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు

## మూడు రోజుల పాటు అదనపు సర్వీసులు




స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడానికి తగిన చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ పండుగ ఉండటంతో ప్రజలు ఎక్కువగా ప్రయాణంచేసే అవకాశం ఉంది. పండుగ సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలో అదనపు బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచనున్నారు.

### ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి..



రాఖీ పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులను నడపడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. తిరుగు ప్రయాణంలో కూడా అదనపు బస్సు సర్వీసులను నడపనున్నాం. ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి.

– పి.సంతోష్‌కుమార్, ఆర్టీసీ ఆర్‌ఎం

### 245 అదనపు బస్సు సర్వీసులు..

ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి 245 అదనపు బస్సు సర్వీసులను ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నడపనున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈ నెల 9నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్ వైపు 155 అదనపు ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ రూట్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అదనపు బస్సు ట్రిపుల కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. 7న 70 బస్సులు, 8న 75, 9న 126, 10న 75, 11న 88 అదనపు బస్సు సర్వీసులు తిరగనున్నాయి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, గచ్చిబౌలితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ మేరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా తాగునీటి వసతి, షెల్టర్లు, కూర్చోవడానికి వసతి, మైకుల ద్వారా బస్సుల వివరాలు, సూచనలను ఎప్పటికప్పుడూ ప్రయాణికులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

### డిపోల వారీగా బస్సు సర్వీసులు ఇలా.. (7 నుంచి 11వ తేదీ వరకు..)

| డిపో | 7న | 8న | 9న | 10న | 11న |
|---|---|---|---|---|---|
| అచ్చంపేట | 6 | 6 | 12 | 6 | 4 |
| గద్వాల | 10 | 10 | 14 | 10 | 12 |
| కల్వకుర్తి | 6 | 6 | 10 | 6 | 7 |
| కొల్లాపూర్ | 6 | 6 | 12 | 6 | 4 |
| మహబూబ్‌నగర్ | 8 | 10 | 19 | 10 | 13 |
| నాగర్‌కర్నూల్ | 7 | 7 | 12 | 7 | 10 |
| నారాయణపేట | 8 | 9 | 15 | 9 | 8 |
| షాద్‌నగర్ | 8 | 10 | 13 | 10 | 13 |
| వనపర్తి | 11 | 11 | 19 | 11 | 17 |

# ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సీపీఐ 23వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న ప్రజలకు ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే భరోసా ఉందన్నారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలపై పాలకుల నిర్లక్ష్యపు వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ సీపీఐ అనేక పోరాటాలు చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో మొదలుకొని దేశ సమగ్ర నిర్మాణం వరకు అనేక దశల్లో ప్రధాన పాత్ర పోషించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రాంతాన్ని స్వతంత్ర భారతంలో విలీన ఉద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటంలో వేల మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆత్మబలిదానాలు చేశారని గుర్తుచేశారు. దున్నే వాడికే భూమి అన్న నినాదంతో దాదాపు 10లక్షల ఎకరాలను పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. పాలమూరు జిల్లాలో పారిశ్రామిక కాలుష్యం పెరుగుతుందని.. కాలుష్యంపై సీపీఐ పోరాడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వంద రోజులపాటు పని కల్పించే ఉపాధి హామీ చట్టం అమలు సీపీఐ పోరాట ఫలితమేనన్నారు. సీపీఐ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్, మాజీ కార్యదర్శి పరమేశ్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు రాము, అల్వాల్‌రెడ్డి, కృష్ణయాదవ్, గోవర్ధన్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ రాజు పాల్గొన్నారు.

# సాగు చట్టాలు కొనసాగించేందుకు కుట్ర

- యూరియా కొరతను సృష్టించొద్దు
- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రైతాంగం ఒత్తిడి ఫలితంగా రద్దు చేసిన సాగు మూడు నల్ల చట్టాల స్థానంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం పేరిట దొడ్డి దారిన కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పునాస పంటల సాగు మొదలైందని, రైతులకు అవసరమైన ఎరువుల పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతులకు డీఏపీ, యూరియా సరఫరాలో కోత విధిస్తున్నారని తెలిపారు. రైతుల అవసరం మేరకు ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల సమస్యను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం సరికాదన్నారు.

**రూ.21వేల కోట్లతో సరి..**

రాష్ట్రంలో రైతులకు రూ.42 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉండగా కేవలం రూ.21 వేల కోట్లు మాత్రమే చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ మార్కెట్ విధానంతో రైతుల మోటార్లకు మీటర్లు బిగించి బిల్లులు వసూలు చేసి పద్ధతికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఆగస్టు 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ, రెండో రోజు సుదర్శన్ కన్వెన్షన్‌లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మేష్, సీహెచ్ రాంచందర్, వెంకటేశ్, రామకృష్ణ, సాంబశివుడు, మన్యం, సీతారాం, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ నిర్వాకం



వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

- నకిలీ పత్రాలతో రూ.2.61 కోట్ల రుణాలు
- అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

వనపర్తి: సమాజంలో అక్రమాలు, అన్యాయాలను నిలువరించాల్సిన ఓ కానిస్టేబుల్ విధులకు దీర్ఘకాలిక సెలవుపెట్టి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకు, ఎల్‌ఐసీలో గృహ రుణాలు తీసుకొని బ్యాంకర్లను బురిడీ కొట్టించారు. హైదరాబాద్ భద్రతా విభాగం అధికారి జి.కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పోలీసులు సుదీర్ఘ విచారణ చేపట్టి మూడు ఇళ్లకు సంబంధించి తొమ్మిదికి పైగా నకిలీ పత్రాలు తయారు చేసి రూ.2.61 కోట్ల రుణాలు తీసుకున్నట్లు తేల్చారు. మంగళవారం మధ్యాహ్నం డీఎస్పీ వెంకటేశ్వర్లు, విచారణ అధికారులతో కలిసి ఎస్పీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. 2023, జూన్‌లో బ్యాంకర్లను మోసం చేయగా.. 2025, జనవరి 27న అందిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి పూర్తి ఆధారాలతో నిందితులు రాకేష్, పోతు హరీశ్‌కుమార్, తాళ్లపల్లి మహేష్, సందీప్, సుంకరి శేఖర్, బుక్క కిషోర్‌కుమార్ నేరంలో భాగస్వాములని గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం మరికొందరు పోలీస్ కానిస్టేబుళ్లను మోసం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. జిల్లాకేంద్రానికి చెందిన కానిస్టేబుల్ రాకేష్ నేతృత్వంలో ఈ బృందం మోసాలకు పాల్పడినట్లు విచారణ తేలిందని చెప్పారు. బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగం చేస్తూ.. ఇలాంటి మోసాలకు పాల్పడిన రాకేష్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ హరిప్రసాద్, సీసీఎస్ ఎస్‌ఐలు రామరాజు, విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్, నగేష్, కానిస్టేబుల్, పురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్‌పీ.వెంకటేశ్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావలలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌కు (సీనియర్) ఎంపికైన విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో (18– 28) విభాగంలో ఎం.నందిని, వై.అమర శ్రీఅభిజ్ఞాన్, జె.కావేరి, బి.అంకిత, ఆర్.సురేఖ, (45– 55) విభాగంలో కె.వనజారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయూష్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఫయాం, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ పీడీ డాక్టర్ ఎస్.రజిని తదితరులు పాల్గొన్నారు.

# వాగులో ఒరిగిన బస్సు : తప్పిన ప్రమాదం



పొక్లెయిన్ సాయంతో బస్సును బయటకు లాగుతున్న దృశ్యం

కల్వకుర్తి రూరల్: మండలంలోని రామగిరి–రఘుపతిపేట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న దుందుభి వాగులో మంగళవారం సాయంత్రం కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒకవైపు ఒరగడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కల్వకుర్తి డిపోకు చెందిన బస్సు అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని లింగాల నుంచి కల్వకుర్తికి బయలుదేరింది. దుందుభి వాగు దాటే క్రమంలో ఒకవైపుకు ఒరిగింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు సురక్షితంగా కిందకు దిగారు. సమాచారం అందుకున్న డిపో మేనేజర్ సుభాషిని ఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో బస్సును వాగు నుంచి బయటకు తెచ్చి ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చారు. జులై 21న గౌరారం గ్రామానికి చెందిన జంగయ్య వాగులో పడి మతి చెందిన ఘటన పాఠకులకు విధితమే. సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అథ్లెటిక్స్‌లో పాలమూరుకు 15 పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో 3, 4 తేదీల్లో జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 6 బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 3 కాంస్య పతకాలతోపాటు అండర్–18 బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అభినందించి శాలువాలతో సత్కరించారు. సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజేందర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్‌కుమార్, క్రీడాకారులు కె.రమేష్‌బాబు, శ్రీనివాసులు, కోచ్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

**పతకాలు సాధించిన క్రీడాకారులు..**

బాలుర అండర్–18 విభాగం కె.శివకుమార్–200 మీ., 400 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, కాడం కార్తీక్–హెప్టథాన్ బంగారు, లాంగ్‌జంప్ రజతం, కె.శివ–1000 మీ. బంగారు, ఎస్.రాము–100 ఎంహెచ్‌లో కాంస్యం, బాలుర అండర్–20 విభాగంలో బి.శ్రీధర్–400 ఎంహెచ్ బంగారు, 400మీలో రజతం, టీమ్ 4 400రిలే రజతం, జ్ఞానేశ్వర్‌రెడ్డి–డెకథ్లాన్‌లో రజతం, వేపూర్ నరేందర్–1000 మీటర్ల పరుగులో కాంస్యం, బాలికల అండర్–18 విభాగంలో బి.పౌర్ణమి–డిస్కస్‌త్రోలో బంగారు, షాట్‌పుట్‌లో కాంస్యం, రాత్లావత్ కీర్తన–1000 మీటర్ల పరుగులో రజతం, మహిళల విభాగంలో సురమనిపూజ–1500 మీటర్ల పరుగులో రజత పతకాలు సాధించారు.

### పాలమూరు ఓటమి

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో బీ–డివిజన్ టూ డే లీగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లూస్ జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 26 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. 195 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కి దిగిన మహబూబ్‌నగర్ మంగళవారం వికెట్ నష్టపోకుండా 22 పరుగుల ఓవర్‌నైట్ స్కార్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ప్రత్యర్థి బౌలర్లు విజృంభించడంతో 48.2 ఓవర్లలో 168 పరుగులకే జిల్లాజట్టు ఆలౌట్ అయింది. కొండ శ్రీకాంత్ (30), బి.అక్షయ్ (26), కేథన్‌కుమార్ (26), అబ్దుల్ రాఫే (23) ఓ మోస్తరుగా రాణించారు. హైదరాబాద్ బ్లూస్ బౌలర్లలో అభిరామ్, ఉర్వేష్ కక్కడ్ మూడేసి వికెట్లు, మహాస్ ఒరుగంటి రెండు వికెట్లు తీశారు.

# జూరాలకు 29,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 49వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రం 6:30 గంటల వరకు 29,600 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గిందని పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,997, కోయిల్ సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 1,080, కుడి కాల్వకు 690, సమాంతర కాల్వకు 1,000, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 41,902 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**423.468 ఎం.యూ. విద్యుదుత్పత్తి**

జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్లలో 195 మెగావాట్లు, 193.438 ఎం.యూ., దిగువలో 6 యూనిట్లలో 240 మెగావాట్లు, 230.030 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు. ఇప్పటి వరకు మొత్తం 423.468 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపట్టారు.

- శ్రీశైలం జలాశయంలో 881.5 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రస్తుతం 196.1108 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 51,032 క్యూసెక్కుల వరద వస్తుండగా.. శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తికి 35,315, కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తికి 30,910 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 24గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 35,000, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 3,225, ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 17.070 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.3883 మి.యూ.విద్యుదుత్పత్తి చేశారు.
- సుంకేసుల డ్యాంకు 18వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4 గేట్లను తెరిచి 17,380 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కులు నీటిని వదిలినట్లు పేర్కొన్నారు.

# పాఠశాల అదనపు గదులకు తాళం

- ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించిన మరుసటి రోజే ఘటన
- బిల్లులు రాకపోవడంతో తాళం వేసిన కాంట్రాక్టర్లు
- ఆరు నెలల క్రితమే డబ్బులు డ్రా చేసుకున్న హెచ్‌ఎం



కాంట్రాక్టర్ తాళం వేసిన అదనపు గదులు ఇవే..

మిడ్జిల్: బిల్లులు చెల్లించకుండా ప్రారంభించారని పాఠశాల అదనపు తరగతి గదులకు కాంట్రాక్టర్ తాళం వేసిన సంఘటన మండలంలోని వస్పులలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వస్పుల ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ కింద అదనపు గది, సైన్స్ ల్యాబ్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.27 లక్షలు మంజూరు చేశారు. అయితే మొదటి విడతగా పాఠశాల హెచ్‌ఎం ఖాతాలో రూ.9 లక్షలు జమ చేయడంతో గ్రామానికి చెందిన నలుగురు యువకులు పాఠశాలలో పనులు ప్రారంభించారు. ఇందుకు గాను వీరికి రూ.7.50 లక్షలు హెచ్‌ఎం, ఏఈ లేటర్‌తో చెల్లింపులు చేశారు. మిగతా రూ.1.50 లక్షలను హెచ్‌ఎం తన సొంత ఖాతాలో మార్చి నెలలో జమ చేసుకున్నారు. దీంతో రెండో విడత డబ్బులు మళ్లీ రావాలంటే గతంలో మంజూరు చేసిన డబ్బులు, పనుల పురోగతిని ఏఈ, బ్యాంక్ బ్యాలెన్స్, కాంట్రాక్టర్లకు చెల్లించిన లేటర్ జమ చేయాలి. వారికి చెల్లించగా మిగిలిన డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ ఉన్నట్లు రికార్డు సమర్పించాలి. ఇదిలా ఉండగానే అదనపు గదుల నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 2న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. మరుసటి రోజు బ్యాలెన్స్ డబ్బుల కోసం రికార్డులను పరిశీలించగా పాఠశాల హెచ్‌ఎం రూ.1.49 లక్షలు డ్రా చేసుకున్నట్లు తెలియడంతో కాంట్రాక్టర్లు సోమవారం ప్రారంభించిన అదనపు గదులకు తాళం వేశారు. ఈ విషయం మంగళవారం 'సాక్షి'కి తెలియగా పాఠశాలను పరిశీలించగా అదనపు గదులకు తాళం వేసి ఉంది. అప్పులు చేసి ప్రభుత్వ పనులు చేస్తే.. మంజూరైన డబ్బులను హెచ్‌ఎం సొంత అవసరాలకు వాడుకోవడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇదే పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులకు వచ్చిన డబ్బుల నుంచి హెచ్‌ఎం రూ.10 వేలు తీసుకున్నారని సంబంధిత కాంట్రాక్టర్ ఆరోపించారు. ఈ విషయమై హెచ్‌ఎం వెంకటయ్యను వివరణ కోరగా తాను తప్పు చేశానని, రూ.1.49 లక్షలు నాలుగైదు రోజుల్లో తిరిగిస్తానని, ఈ విషయం పేపర్‌లో రాయొద్దని కోరారు. ఈ విషయమై సర్వశిక్ష అభియాన్ ఏఈ జింబ్యానాయక్‌ను వివరణ కోరగా మొదటి విడత డబ్బులలో హెచ్‌ఎం తన సొంత ఖాతాకు రూ.1.49 లక్షలు మార్చి నెలలో డ్రా చేసుకున్నాడని, ఇంత వరకు కాంట్రాక్టర్లకు ఇవ్వకపోవడంతో వారు డబ్బుల కోసం తన దగ్గరికి వస్తున్నారని చెప్పారు. డబ్బులు ఇవ్వాలని హెచ్‌ఎంకు సూచించినా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు.

# కాపాడబోయి కాటికి వెళ్లారు

- బావిలో దూకిన భార్యను రక్షించబోయిన భర్త మృతి
- అక్కను కాపాడే క్రమంలో చెల్లి సైతం..

మోమిన్‌పేట: డబ్బుల విషయంలో నెలకొన్న చిన్నపాటి గొడవ ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లికి చెందిన గాగోళ్ల మాసయ్య(60), ఇతని భార్య అలివేలు వికారాబాద్ జిల్లా చీమల్‌దరిలోని ఓ వెంచర్‌లో పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే అలివేలు చెల్లి నాగమ్మ నాలుగు రోజుల క్రితం వీరి వద్దకు వచ్చింది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో తాను చనిపోతానంటూ అలివేలు వెంచర్ పక్కనే ఉన్న బావిలో దూకింది. ఆమెను కాపాడేందుకు మాసయ్య సైతం దూకాడు. అక్క మునిగిపోతోందని గమనించిన నాగమ్మ ఒడ్డుపైనుంచి తన చెయ్యి అందించే క్రమంలో బావిలో జారిపడింది. భార్య అలివేలును కాపాడిన మాసయ్యతో పాటు నాగమ్మ నీటిలో మునిగిపోయారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అరవింద్ పంచానామా నిర్వహించారు. మృతుడి భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఓ కుమారుడు, మృతురాలికి ఓ కూతురు ఉన్నారు.